స్వశక్తి సంఘాలకు ఊరట

- 698 మహిళా సంఘాలకు రెండేళ్ల వడ్డీ బ్యాంకు ఖాతాల్లోకి
- నాలుగేళ్ల తర్వాత రూ.2.13కోట్లు విడుదల
- హర్షం వ్యక్తం చేస్తున్న మహిళా సంఘాల సభ్యులు

పెద్దవూర : రుణాలను సకాలంలో చెల్లించిన స్వశక్తి మహిళా సంఘాలకు ప్రభుత్వం రెండేళ్ల వడ్డీని విడుదల చేసింది. దీంతో మహిళా సంఘాల సభ్యులకు కొంత ఊరటనిచ్చినట్లయ్యింది. బ్యాంకుల్లో తీసుకున్న రుణం స్వశక్తి సహాయక సంఘాలు ప్రతినెలా 10వ తేదీలోపు అసలు, వడ్డీని చెల్లిస్తున్నారు. వడ్డీని మూడు నెలలకు ఒకసారి సంఘం పొదుపు బ్యాంకు ఖాతాలో జమచేయాల్సి ఉంటుంది. నాలుగేళ్లుగా వడ్డీ చెల్లింపులు నిలిచిపోయాయి. 2014 వరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గత కాంగ్రెస్ హయాంలో ప్రతి ఆరునెలలకు ఒకసారి వడ్డీని సంఘాలకు సంబంధించిన బ్యాంకు ఖాతాల్లో జమచేసేవారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తర్వాత టీఆర్ఎస్ ప్రభుత్వం మహిళా సంఘాలకు వడ్డీ రుణాల చెల్లింపులపై నిర్లక్ష్యం చేయడంతో 2014-2018 వరకు వీటి బకాయిల చెల్లింపులు నిలిచిపోయాయి. మహిళా సంఘాల సభ్యులు మాత్రం నెల నెలా రుణాల చెల్లింపుల్లో సక్రమంగా ముందుకెళ్లారు. 2018 ఎన్నికల ముందు వడ్డీని ప్రభుత్వం మహిళా సంఘాల ఖాతాల్లో జమచేసింది. మళ్లీ 2018 నుంచి వడ్డీ చెల్లింపులు నిలిచిపోవడంతో మహిళా సంఘాలకు భారంగా మారింది. గత నెలలో 2018-19, 2019-2020 లకు సంబంధించిన వడ్డీ బకాయిలను ప్రభుత్వం విడుదల చేసింది. మరో రెండేళ్లకు సంబంధించిన వడ్డీ బకాయిలు రావాల్సి ఉంది. వడ్డీ వ్యాపారుల బెడద నుంచి రక్షించి, మహిళలపై ఆర్థిక భారం తగ్గించేందుకుగాను ప్రభుత్వం 2012లో వడ్డీలేని రుణం(వీఎల్ఆర్) ప్రవేశపెట్టింది. స్వశక్తి సంఘాలకు బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి కింద అందిస్తున్న రుణాలకు ప్రభుత్వం వడ్డీ చెల్లిస్తుంది. 2018 మార్చి వరకు ప్రభుత్వం ఏటా వడ్డీ చెల్లించినప్పటికీ అనంతరం చేతులెత్తేయడంతో బకాయిలు పేరుకుపోయాయి. ప్రస్తుతం ప్రభుత్వం వడ్డీ బకాయిలను విడుదల చేయడంతో కొంతమేరకు భారం తొలగిందని మహిళలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



మహిళా సమాఖ్య భవనం

మండలంలో 864 గ్రామ స్వశక్తి సంఘాలు..

మండలంలో 26గ్రామపంచాయతీలు ఉండగా 864 గ్రామ స్వశక్తి సంఘాలు, 42 గ్రామ సమైక్య సంఘాలు (వీఓ సంఘం)ఉన్నాయి. వాటిలో సుమారు 8600కు పైగా సభ్యులు ఉన్నారు. సీనియారిటీ ప్రాతిపదికన సంఘాలు రూ.50వేల నుంచి రూ.20లక్షల వరకు వివిధ బ్యాంకుల నుంచి రుణాలు పొందుతున్నాయి. ఈ రుణాలపై బ్యాంకులు 12నుంచి 14శాతం వరకు వడ్డీని వసూలు చేస్తున్నాయి.

బ్యాంకు ఖాతాల్లో వడ్డీ జమ



స్వశక్తి సంఘాలకు బ్యాంకు లింకేజీ రుణాలకు సంబంధించి 698సంఘాలకు రూ.2.13కోట్ల వడ్డీ విడుదలైంది. నాలుగేళ్ల వడ్డీ బకాయిలకు గాను ప్రస్తుతం రెండేళ్లకు సంబంధించిన డబ్బులు మాత్రమే వచ్చాయి. ఆయా సంఘాల బ్యాంకు ఖాతాల్లో వడ్డీ బకాయిలను నేరుగా జమచేశాం.

– విజయ్‌కుమార్, ఏపీఎం, పెద్దవూర

మండలానికి రూ.2.13 కోట్లు మంజూరు..

మండలంలో మొత్తం 864గ్రామ స్వశక్తి సంఘాలు ఉన్నాయి. వాటిలో ప్రతినెలా 10వ తేదీలోపు సక్రమంగా రుణాలు చెల్లించిన సంఘాలకు ప్రభుత్వం వడ్డీ సొమ్మును జమ చేసింది. 2018-19 ఆర్థిక సంవత్సరానికి గాను రుణాలు సక్రమంగా చెల్లించిన 628సంఘాలకు రూ.23.03లక్షలు, 2019-20ఆర్థిక సంవత్సరానికి గాను 698గ్రామ స్వశక్తి సంఘాలకు రూ.190.34లక్షలు(రూ.1.90కోట్లు) మంజూరయ్యాయి. మొత్తంగా మహిళా సంఘాల ఖాతాల్లో మండలంలో రూ.2.13కోట్లు ప్రభుత్వం జమ చేసింది.

క్లుప్తంగా

గోదాములను పరిశీలించిన అదనపు కలెక్టర్



అధికారులకు సూచనలిస్తున్న అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు

మాడుగులపల్లి : మండలంలోని గజలాపురంలో వేర్‌హౌస్ గోదాములను గురువారం అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడారు. కొనుగోలు కేంద్రాల నుంచి వచ్చిన ధాన్యాన్ని వెంటనే దిగుమతి చేసి లారీలను పంపాలని సిబ్బందిని ఆదేశించారు. తడిసిన ధాన్యాన్ని సైతం వ్యవసాయ విస్తరణ అధికారి నిర్ధారిస్తే వెంటనే దిగుమతి చేయాలని సూచించారు. ఆయన వెంట నల్లగొండ ఆర్డీఓ జయచంద్రారెడ్డి, డీఎస్‌ఓ వెంకటేశ్వర్లు, పౌర సరఫరాల శాఖ డీఎం నాగేశ్వరరావు, గోదాము సిబ్బంది ఉన్నారు.

షిర్డీ సాయి ఆలయంలో మాజీ ఎమ్మెల్యే పూజలు



పూజలు నిర్వహిస్తున్న రాజగోపాల్‌రెడ్డి

చింతపల్లి : మండల కేంద్రంలో శ్రీ షిర్డీసాయి నాథుడిని గురువారం బీజేపీ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ మండల నాయకులు ఆయనకు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఆయన వెంట నాయకులు కల్యాణ్‌నాయక్, లాలు నాయక్, రమేశ్‌యాదవ్, దావా శ్రీనివాసులు, బొడ్డు శ్రీనివాసులు, అనిత, సముద్రాల నగేశ్, మహేశ్, మధు, వెంకటరమణ పాల్గొన్నారు.

భరోసా సభను విజయవంతం చేయాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న బీఎస్పీ నాయకులు

చింతపల్లి : హైదరాబాద్‌లోని సరూర్‌నగర్‌లో ఈనెల 7న బీఎస్పీ ఆధ్వర్యంలో నిర్వహించే తెలంగాణ భరోసా సభను విజయవంతం చేయాలని ఆ పార్టీ నియోజకవర్గ అధ్యక్షుడు రమావత్ రమేశ్‌నాయక్ కోరారు. గురువారం మండల కేంద్రంలో తెలంగాణ భరోసా సభకు సంబంధించిన పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. సభకు మండలంలోని అన్ని గ్రామాల నుంచి పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు ముదిగొండ మొగిలయ్య, శ్రీకాంత్, గిరి, యాదగిరి, కోటేశ్, లక్ష్మణ్, శ్రీహరి, రాములు, ధనుష్ ఉన్నారు.

దేవరకొండ సీఐగా శంకర్



సీఐగా బాధ్యతలు స్వీకరిస్తున్న శంకర్

దేవరకొండ : పట్టణ నూతన సీఐగా ఎం.శంకర్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ సీఐగా పనిచేసిన శ్రీనివాసులు కొండమల్లేపల్లికి బదిలీపై వెళ్లగా ఆయన స్థానంలో రాచకొండ కమిషనరేట్ నుంచి సీఐ శంకర్ బదిలీపై దేవరకొండకు వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన సీఐకి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సిబ్బంది ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సీఐ శంకర్ మాట్లాడుతూ.. దేవరకొండ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలు సహకరించాలని కోరారు.

మినీపార్క్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి



మినీ పార్క్‌ను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ భార్గవ్

మిర్యాలగూడ టౌన్ : మున్సిపాలిటీలోని మినీ పార్క్‌ను కాలనీవాసులు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్మన్ తిరునగరు భార్గవ్ అన్నారు. గురువారం పట్టణంలోని షాబునగర్‌లో ఏర్పాటు చేసిన మినీపార్క్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఉదయం, సాయంత్రం వేళల్లో చిన్న, పెద్ద వారు సేదతీరేందుకు, వాకింగ్ చేసుకునేందుకు ఈ మినీ పార్క్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రవీందర్‌సాగర్, కౌన్సిలర్ ఉదయ్‌భాస్కర్, తిరునగరు నాగలక్ష్మి, మున్సిపల్ డీఈ సాయిలక్ష్మి, నాయకులు గుడిపాటి సైదులు, రేపాల రమేష్, సైదిరెడ్డి, అశోక్, శ్రీను, బాబ్జీ, మధు కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లో కాంటాలు పూర్తిచేయాలి



రైతులతో మాట్లాడుతున్న నిడమనూరు మార్కెట్ చైర్మన్ మర్ల చంద్రారెడ్డి

త్రిపురారం : ధాన్యం కొనుగోలు కేంద్రాలలో కాంటాలు సకాలంలో పూర్తిచేయాలని నిడమనూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మర్ల చంద్రారెడ్డి నిర్వాహకులకు సూచించారు. గురువారం మండలంలోని కొణతాలపల్లిలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కాంటాలు వేసిన బస్తాలు లారీలు రాకపోవడంతో ఎక్కువ రోజులు ఉండడంతో తూకాలు తగ్గి షార్టేజీ వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తూ చైర్మన్‌కు ఫిర్యాదు చేశారు. ఆయన వెంట త్రిపురారం ఏపీఎం అశోక్‌కుమార్, సీసీ దేవ్‌సింగ్ రైతులు ఉన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ..

మండలంలోని కంపాలపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని మునగభావిగూడెం గ్రామానికి చెందిన మర్రి సోమమ్మ అనారోగ్యంతో గురువారం మృతి చెందింది. దీంతో చంద్రారెడ్డి ఆమె మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన వెంట మర్రి లింగయ్య, రామకృష్ణ, బొప్పిడి అనంతరెడ్డి, బొర్రయ్య, మారయ్య, సైదులు, సూరయ్య, అంజయ్య, భిక్షమయ్య, వెంకన్న ఉన్నారు.

హామీల అమలులో ప్రభుత్వాలు విఫలం



సమావేశంలో మాట్లాడుతున్న నర్సింహారెడ్డి

దేవరకొండ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల ముందు ప్రజలకిచ్చిన హామీలు అమలు చేయడంలో పూర్తిగా విఫలమయ్యాయని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పల్లా నర్సింహారెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని పల్లా పర్వత్‌రెడ్డి భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర విభజన చట్టం హామీలను అమలు చేయకుండా కేంద్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తుందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను కేంద్రం పెట్టుబడిదారులకు కట్టబెడుతుందన్నారు. తెలంగాణ ప్రభుత్వం అర్హులైన ప్రతి ఒక్కరికి ఇంటి స్థలాన్ని కేటాయించి ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం రూ.5లక్షలు కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంజయ్యనాయక్, సీపీఐ జిల్లా కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మైనొద్దీన్, అంజనేయులు, వెంకట్రాములు, రాంరెడ్డి, మల్లయ్య, తదితరులున్నారు.

నీటి సమస్య తలెత్తకుండా చూడాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ జ్యోతిలక్ష్మి

మిర్యాలగూడ : గ్రామాల్లో నీటి సమస్య తలెత్తకుండా జాగ్రత్త వహించాలని ఎంపీడీఓ జ్యోతిలక్ష్మి సిబ్బందికి సూచించారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో టీఏలు, ఎఫ్‌లతో నిర్వహించిన సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ప్రతి గ్రామపంచాయతీలో కొత్త పనులు గుర్తించి అంచనాలను తయారు చేసుకోవాలని అన్నారు. గ్రామాల్లో ప్రతి రోజు సుమారు 150మంది కూలీలతో కొలతల ప్రకారం పనిచేయించాలన్నారు. గ్రీన్ ప్లాన్ ప్రకారం మొక్కలు ఎంపిక చేసుకోవాలన్నారు. కంపోస్ట్‌షెడ్‌లో వారం రోజుల్లో కంపోస్ట్‌ను తయారు చేయాలని, ప్రతి గ్రామపంచాయతీల్లో శ్మశాన వాటికలను వాడుకలోకి తీసుకురావాలన్నారు. గ్రామాల్లో క్రీడా ప్రాంగణ స్థలాలను ఎంపిక చేసి అంచనాలను తయారు చేసి పనులను త్వరగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. కార్యదర్శులు సమ్మెలో ఉన్నందున గ్రామాల్లో అభివృద్ధి పనులకు ఎలాంటి ఆటకం కలగకుండా మండల కార్యాలయ సిబ్బందికి అదనపు బాధ్యతలు ఇచ్చినట్లు తెలిపారు. సమావేశంలో ఎంపీఓ టి.వీరారెడ్డి, ఇన్‌చార్జ్ ఏపీఓ కళావతి, టీఏలు, ఫీల్డ్ అసిస్టెంట్లు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

'కంటి వెలుగు'ను సద్వినియోగం చేసుకోవాలి



మిర్యాలగూడ అర్బన్ : కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న తిప్పన విజయసింహారెడ్డి

మిర్యాలగూడ అర్బన్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆగ్రో కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ తిప్పన విజయసింహారెడ్డి అన్నారు. గురువారం మండలంలోని అన్నారం గ్రామంలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్రంలో వృద్ధులు అంధత్వంతో బాధపడకూడదనే లక్ష్యంతో కేసీఆర్ కంటి వెలుగు పథకాన్ని ప్రవేశపెట్టారని అన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ధనావత్ చిట్టిబాబునాయక్, నాయకులు ఏడుకొండలు, అంబటి వెంకట్‌రెడ్డి, కోటిరెడ్డి, సైదిరెడ్డి, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్‌రెడ్డి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వేములపల్లి : తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న రెండో విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీటీసీ ఇరుగు మంగమ్మ అన్నారు. గురువారం మండలంలోని శెట్టిపాలెంలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. చూపు మందగించిన వారికి కంటి పరీక్షలు నిర్వహించి వెంటనే కళ్లద్దాలు అందజేస్తారని తెలిపారు. ఆపరేషన్లు అవసరమైన వారికి ప్రభుత్వమే ఉచితంగా ఆపరేషన్లు నిర్వహిస్తుందన్నారు. కార్యక్రమంలో గ్రామసర్పంచ్ మజ్జిగపు పద్మసుధాకర్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ నక్క శేఖర్, ఎంపీడీఓ అజ్మీరాదేవిక, బీఆర్ఎస్ జిల్లా నాయకుడు కట్టా మల్లేష్‌గౌడ్, నాయకులు కాట్రగడ్డ గోపాల్‌రావు, డాక్టర్లు, ఏఎన్ఎంలు, ఆశవర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు, వార్డుమెంబర్లు తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్‌ను తొలగించాలని ధర్నా



సమావేశాన్ని బహిష్కరించి ధర్నా చేస్తున్న వార్డుసభ్యులు

మాడుగులపల్లి : గ్రామసభ నిర్వహించకుండా ఏకపక్ష తీర్మానాలతో అక్రమాలకు పాల్పడుతున్న మాడుగులపల్లి సర్పంచ్‌ను పదవి నుంచి వెంటనే తొలగించాలని పలువురు వార్డుసభ్యులు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన పాలకవర్గ సమావేశంలో ఐదుగురు వార్డు సభ్యులు సమావేశాన్ని బహిష్కరించి కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. నాలుగు నెలలుగా గ్రామసభ నిర్వహించకుండా సర్పంచ్ ఇష్టానుసారంగా తీర్మానాలు చేసి అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. బృహత్ పల్లెప్రకృతి వనంలో సౌకర్యాలు కల్పించకుండా ప్రజాధనాన్ని వృథా చేశారని, నల్లకుంట నుంచి మట్టి తవ్వకానికి ఓ కాంట్రాక్టర్‌కు అక్రమంగా అనుమతి ఇచ్చారని మండిపడ్డారు. అక్రమాలపై కలెక్టర్, డీపీఓలకు ఫిర్యాదు చేయడంతో తమపై సర్పంచ్ భర్త కక్షసాధింపు చర్యలకు దిగుతున్నారని వార్డుసభ్యులు నరేష్, రామకృష్ణ, నాగరాజు, స్వాతి, అలివేలు ఆవేదన వ్యక్తం చేశారు.

ఘనంగా బొడ్రాయి ప్రతిష్ఠాపన మహోత్సవం



పూజల్లో పాల్గొన్న దేవేందర్, తదితరులు

దేవరకొండ : మండల పరిధిలోని తాటికోల్ గ్రామంలో గురువారం బొడ్రాయి ప్రతిష్ఠాపన మహోత్సవాలను సర్పంచ్ జూలూరు ధనలక్ష్మీబాలనారయణగౌడ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ మహోత్సవంలో మునుగోడు మాజీ ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి, దేవరకొండ మాజీ ఎమ్మెల్యే నేనావత్ బాలూనాయక్, ఎంపీపీ నల్లగాసు జాన్‌యాదవ్, జెడ్పీటీసీ అరుణసురేష్‌గౌడ్, మున్సిపల్ మాజీ చైర్మన్ వడ్త్య దేవేందర్‌నాయక్, మున్సిపల్ చైర్మన్ అలంపల్లి నర్సింహ తదితరులు వేర్వేరుగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక ఎంపీటీసీ జూలూరి ఉత్తరమ్మ, సామల రవి, కేతావత్ లాలూనాయక్, సైదులుగౌడ్, కళ్యాణ్‌నాయక్, వెంకటేష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

స్విమ్మింగ్ పూల్ ప్రారంభం

కొండమల్లేపల్లి : మండలంలోని దొనియాల గ్రామంలో ఏర్పాటు చేసిన జలవిహార్ స్విమ్మింగ్ పూల్‌ను సీఐ శ్రీనివాస్, ఎస్ఐ వీరబాబు, సర్పంచ్ కుంభం శ్రీనివాస్‌గౌడ్ గురువారం ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. శిక్షకులు, తల్లిదండ్రుల సమక్షంలోనే ఈత నేర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో శంకర్‌గౌడ్, రాజు, శ్రీనివాసచారి పాల్గొన్నారు.

కరపత్రాలు విడుదల

వేములపల్లి : మండలంలోని మొల్కపట్నం గ్రామానికి చెందిన సీపీఎం జిల్లా నాయకుడు మాలి పురుషోత్తంరెడ్డి ద్వితీయ వర్ధంతి సభను జయప్రదం చేయాలని ఆ పార్టీ మండల కార్యదర్శి పాదూరి శశిధర్‌రెడ్డి కోరారు. గురువారం గ్రామంలో శనివారం నిర్వహించనున్న వర్ధంతి సభ కరపత్రాలను ఆయన విడుదల చేసి మాట్లాడారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు రెమడాల పరుశురాములు, భిక్షం, ఎల్లమ్మ తదితరులు ఉన్నారు.

విద్యుత్ తీగలపై విరిగిపడిన చెట్టు కొమ్మలు

మిర్యాలగూడ టౌన్ : పట్టణంలోని 29వ వార్డు సీతారాంపురం గీతామందిర్ సమీపంలో గురువారం రాత్రి చెట్టు కొమ్మలు విరిగి పక్కనే ఉన్న వీధి దీపాల స్తంభాల తీగలపై పడ్డాయి. తీగలకు విద్యుత్ సరఫరా అవుతుండడంతో ఇళ్ల బయట నిలబడి ఉన్న వారు భయాందోళనకు గురయ్యారు. విద్యుత్ అధికారులకు సమాచారం ఇచ్చినా స్పందించకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ధాన్యం కొనుగోలు చేయాలని ఆందోళన

- రహదారిపై బైఠాయించి పురుగు మందు డబ్బాలతో రైతుల ధర్నా
- అధికారుల హామీతో ఆందోళన విరమణ



నిడమనూరు : ఊట్కూర్ స్టేజీ వద్ద రహదారిపై ధర్నా చేస్తున్న రైతులు

హాలియా : ఆరుగాలం శ్రమించి పండించిన ధాన్యం అమ్ముకోవడానికి రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం రాశులు పోసి 20రోజులు గడుస్తున్నా కొనుగోలు విషయంలో అధికారులు అలసత్వం వహిస్తున్నారని అన్నదాతలు రోడ్డెక్కారు. గురువారం అనుముల మండలంలోని శ్రీనాథపురం రైతులు ఆ స్టేజీ వద్ద హాలియా-నల్లగొండ జాతీయ రహదారిపై బైఠాయించి పురుగుల మందు డబ్బాలతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. నెల రోజుల క్రితం తమ ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తీసుకవచ్చినా ధాన్యం కొనుగోలు విషయంలో తీవ్ర జాప్యం చేస్తున్నారని వాపోయారు. ఒక పక్క కేంద్రాలకు లారీలు రాక, మరో పక్క ధాన్యం కాంటాలు సక్రమంగా కాక రాత్రి సమయంలో కాపలాతో తాము ఇబ్బందులు పడుతున్నామని, అకాల వర్షాలకు ధాన్యం తడిసి మొలకెత్తిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. లారీల్లో మిల్లుల వద్దకు తమ ధాన్యాన్ని తీసుకెళ్లితే తాలు పేరుతో రెండు నుంచి నాలుగు కేజీల తరుగును మిల్లర్లు తీస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సుమారు 2 గంటలకుపైగా రహదారిపై ధర్నా చేయడంతో రోడ్డుకు ఇరువైపులా వాహనాలు భారీగా నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న పోలీసులు, హాలియా తహసీల్దార్ ఘటన స్థలానికి చేరుకొని రైతులకు నచ్చజెప్పడానికి ప్రయత్నించిన తమ ధాన్యాన్ని కొనుగోలు చేసేంత వరకు ఇక్కడి నుంచి కదిలేదు లేదని రైతులు బీష్మించుక కూర్చున్నారు. కొనుగోలు జరిగేలా చూస్తామని అధికారులు హామీ ఇవ్వడంతో ఆందోళనను విరమించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మాలే సత్యనారాయణరెడ్డి, పలు గ్రామాల రైతులు తదితరులు ఉన్నారు.

నిడమనూరు : కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కాంటాలు అవుతున్నా లారీలు లేక ఎగుమతులు కావడం లేదని మండలంలోని ఊట్కూర్ గ్రామస్తులు గురువారం నల్లగొండ-సాగర్ ప్రధాన రహదారిపై ధర్నా నిర్వహించారు. ఐకేపీ కేంద్రాలకు లారీలు రాకపోవడంతో ధాన్యం నిల్వలు పేరుకుపోతున్నాయని వారు ఆందోళన వ్యక్తం చేశారు. రోజుకు ఒక్క లారీ మాత్రమే వస్తుందని, దీంతో బస్తాలు కేంద్రాల్లో నిల్వ ఉండడంతో నిర్వాహకులు కాంటాలు వేయడానికి ముందుకు రావడం లేదన్నారు. అధికారులు స్పందించి ధాన్యం కొనుగోలు కేంద్రాలకు ట్రాన్స్‌పోర్ట్ సౌకర్యాన్ని పెంచాలని కాంగ్రెస్ నాయకులు, రైతులు డిమాండ్ చేశారు. ఘటనా స్థలానికి నిడమనూరు, అనుముల తహసీల్దార్‌లు ప్రమీళ, మంగ, ఎస్ఐలు శోభన్‌బాబు, క్రాంతికుమార్ వచ్చి రోజూ నాలుగు లారీలను పంపే ఏర్పాటు చేస్తామని ఆందోళన చేస్తున్న వారికి నచ్చచెప్పి ధర్నాను విరమింపజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అంకతి సత్యం, ముంగి శివమారయ్య, మాజీ సర్పంచ్ నర్సింగ్ కృష్ణయ్య, మట్టారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న జేపీఎస్‌ల నిరవధిక సమ్మె



దేవరకొండలో ముగ్గులు వేసి నిరసన తెలుపుతున్న జేపీఎస్‌లు



చింతపల్లిలో సమ్మెకు సంఘీభావం తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

దేవరకొండ : సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మండలంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట జూనియర్ పంచాయతీ కార్యదర్శులు చేపట్టిన నిరవధిక సమ్మె గురువారం 7వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా జేపీఎస్‌లు స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ముగ్గులు వేసి తమ నిరసన తెలిపారు. అనంతరం పలువురు పంచాయతీ కార్యదర్శులు మాట్లాడుతూ.. ప్రొబేషనరీ కాలం పూరైన కార్యదర్శులను రెగ్యులరైజ్ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో జూనియర్ పంచాయతీ కార్యదర్శులు వెంకటేష్, విజయ్, సంధ్య, స్వామి, అనిల్, హరిత, రాజేశ్వరి, రమేశ్, శ్రీను ఉన్నారు.

డిండి : తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ మండల కేంద్రంలో జూనియర్ పంచాయతీ కార్యదర్శులు చేపట్టిన నిరవధిక సమ్మె గురువారం కొనసాగింది. ఈ సందర్భంగా వారు వంటావార్పు చేసి తమ నిరసన తెలిపారు. కార్యక్రమంలో వేణు, హరి, శ్రీను, వాసు, గిరి, రాము, రహీం, సతీష్, విజయ్, ఉపేందర్, కృష్ణ, నవీన్, నాగేంద్రమ్మ, నవ్య తదితరులు పాల్గొన్నారు.

చింతపల్లి : మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో జూనియర్ పంచాయతీ కార్యదర్శులు చేపట్టిన నిరవధిక సమ్మె గురువారం 7వ రోజుకు చేరింది. సమ్మెకు ఎంపీపీ కొండూరు భవానీ సంఘీభావం తెలిపి మాట్లాడారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు ముచ్చర్ల యాదగిరి, బాల్‌సింగ్, మల్లమ్మ, జంగయ్యగౌడ్, కళమ్మ పాల్గొన్నారు.

కొండమల్లేపల్లి : సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మండలంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట జూనియర్ పంచాయతీ కార్యదర్శులు చేపట్టిన సమ్మె గురువారం 7వరోజుకు చేరింది. ఈ సమ్మెలో మండల కోఆర్డినేటర్ జైహిందర్ పాల్గొని మాట్లాడారు. జూనియర్ పంచాయతీ కార్యదర్శుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ప్రొబేషనరి కాలాన్ని సర్వీస్ కాలంగా గుర్తించాలని, రెగ్యులరైజ్ చేయాలని కోరారు. సమ్మెలో కార్యదర్శులు కిరణ్ సురేష్, అనిత, శిరీష తదితరులు ఉన్నారు.

భజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో దిష్టిబొమ్మ దహనం



కాంగ్రెస్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న భజరంగ్‌దళ్ సభ్యులు

చింతపల్లి : కర్ణాటక రాష్ట్రంలో ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టోలో భజరంగ్‌దళ్ సంస్థను నిషేధిత ఉగ్రవాద సంస్థ పీఎఫ్ఐతో పోల్చడాన్ని నిరసిస్తూ మండల కేంద్రంలో హైదరాబాద్-నాగార్జునసాగర్ రాష్ట్ర రహదారిపై భజరంగ్‌దళ్ నాయకులు గురువారం కాంగ్రెస్ పార్టీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. పీఎఫ్ఐతో భజరంగ్‌దళ్‌ను పోల్చడం సరికాదన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే భజరంగ్‌దళ్‌ను నిషేధిస్తామని చెప్పడం సరికాదన్నారు. కార్యక్రమంలో నాయకులు కల్యాణ్‌నాయక్, శివర్ల రమేశ్‌యాదవ్, కుకుడపు రామకృష్ణ, అభినవ్, సత్యనారాయణ, వినోద్, శివ, ప్రవీణ్, రమేశ్, కల్యాణ్, మహేశ్, నగేశ్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు అన్నదానం



మిర్యాలగూడ అర్బన్ : మున్సిపల్ కార్మికులకు బిర్యానీ పంపిణీ చేస్తున్న నాయకులు

మిర్యాలగూడ అర్బన్ : మున్సిపల్ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ బత్తుల లక్ష్మారెడ్డి జన్మదిన వేడుకలను గురువారం ఆ పార్టీ అభిమానులు ఘనంగా నిర్వహించారు. యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు అజారుద్దీన్ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులకు బిర్యానీ పంపిణీ చేశారు. అదే విధంగా ఆయన అభిమానులు అన్నదానం చేశారు. కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి చిలుకూరి బాలకృష్ణ, కౌన్సిలర్లు ఈశ్వర్‌రెడ్డి, రామకృష్ణ, జానీ, శ్రీనివాస్, సురేష్ ఉన్నారు.

కూరగాయల పంపిణీ..

అడవిదేవులపల్లి : మిర్యాలగూడ మున్సిపల్ కాంగ్రెస్ ఫ్లోర్‌లీడర్ బత్తుల లక్ష్మారెడ్డి జన్మదినం సందర్భంగా గురువారం మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ పారిశుద్ధ్య కార్మికులకు కాంగ్రెస్ పార్టీ నాయకుడు గంజి నాగేశ్వర్‌రావు కూరగాయలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు సాయికుమార్, మల్లిఖార్జున్, అజయ్, శ్రీను తదితరులున్నారు.

అంగన్‌వాడీలో గర్భిణులు పేర్లు నమోదు చేయించుకోవాలి

అడవిదేవులపల్లి : అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు తమ పేర్లు నమోదు చేయించుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగమణి కోరారు. గురువారం మండలంలోని జిలకరకుంట తండాకు చెందిన కుర్ర జ్యోతికి ఇద్దరు పిల్లలున్నారు. మూడోసారి గర్భిణి కావడంతో అంగన్‌వాడీ కేంద్రంలో పేరు నమోదు చేయించుకోకుండా ఉండడంతో స్థానిక సర్పంచ్ కుర్ర పకీరా ఆధ్వర్యంలో గర్భిణి దంపతులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. అనంతరం పేరు నమోదు చేయించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు డి.సరిత, నగ్మా, ఆశవర్కర్ పద్మ ఉన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

వేములపల్లి : మండలంలోని రావులపెంట మూసీవాగు నుంచి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు మైనింగ్ టెక్నికల్ ఆఫీసర్ నాగమణి గురువారం తెలిపారు. రావులపెంటకు చెందిన సీహెచ్.సంపత్, సీహెచ్.ఉపేందర్, పి.సైదులు తమ ట్రాక్టర్లతో ఇసుకను తరలిస్తుండగా పట్టుకుని ఒక్కో ట్రాక్టర్‌కు రూ.5వేల జరిమానా విధించినట్లు తెలిపారు. అనుమతులు లేకుండా ఎవరైనా ఇసుకను, మట్టిని తరలిస్తే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు.

నేడు విగ్రహాల ప్రతిష్ఠ

పెద్దవూర : మండలంలోని తమ్మడపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన సీతారామ లక్ష్మణ సమేత అభయాంజనేయ స్వామి దేవాలయంలో నేడు (శుక్రవారం) దేవతామూర్తుల విగ్రహాల ప్రతిష్ఠ చేపట్టనున్నట్లు కమిటీ సభ్యులు గురువారం తెలిపారు.

దేవాలయాలకు విరాళం

గుర్రంపోడు : మండలంలోని చేపూరు, తానేదార్‌పల్లి గ్రామాల్లో నిర్మిస్తున్న రామాలయాలకు టీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, వ్యాపారవేత్త బసిరెడ్డి పాండురంగారెడ్డి గురువారం రూ.లక్ష 5వేల చొప్పున విరాళం అందజేశారు. కార్యక్రమంలో తిరుమలగిరి ఎంపీపీ భగవాన్‌నాయక్, వైస్ ఎంపీపీ దిలీప్‌రెడ్డి, గుర్రంపోడు జెడ్పీటీసీ సరితారవికుమార్, రైతుబంధు సమితి జిల్లా నాయకులు విజేందర్‌రెడ్డి, సర్పంచ్‌లు విజయ్, శ్రీనివాస్‌రెడ్డి, సభ్యులు ఉన్నారు.

వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

హాలియా : పట్టణంలోని సాయిప్రతాప్‌నగర్‌లో గల శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో దశమ వార్షికోత్సవ పూజలు గురువారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా పూజారి గోవర్ధన శ్రీరామచార్యుల ఆధ్వర్యంలో విశ్వక్షేణ పూజ, పుణ్యాహవచనం, కంకణధారణ పూజలను ఘనంగా నిర్వహించారు. పురోహితులు శ్రీరామచార్యులు మాట్లాడుతూ.. ఈనెల 5న ఆలయంలో శ్రీవేంకటేశ్వర స్వామి కల్యాణం నిర్వహిస్తామని, 6న మహా పూర్ణాహుతి, నవ కళశాభిషేకం పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వెంకటేశ్వర్‌రెడ్డి, న్యాయవాది వాణి, చంద్రకళ, గురువారెడ్డి ఉన్నారు.